26న ప్రత్యేక వైద్య శిబిరం

భీమవరం రూరల్: పట్టణంలోని మెంటేవారి తోటలోని సుందరయ్య భవనంలో ఈ నెల 26న ఆదివారం పక్షవాతం, ఫిట్స్, బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, దీనిని ప్రజలు వినియోగించుకోవాలని అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం కన్వీనర్ రాధాకృష్ణ, వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు కోరారు. అందరికీ వైద్య సహాయం అందించాలనే ఆలోచనతో అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ వైద్య కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. విజయవాడకు చెందిన డాక్టర్ గోపాలం శివన్నారాయణ క్యాంపులో మన హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ డి.సందీప్‌వర్మ తదితరులు పాల్గొని వైద్య సేవలు అందిస్తారన్నారు. శిబిరానికి వచ్చేవారు ముందురోజు బిపి, షుగర్ పరీక్షలను బయట చేయించుకుని ఆ రిపోర్టులు తీసుకొని రావాలన్నారు. అలాగే పాత రిపోర్టులు, వాడే మందులను కూడా తీసుకురావాలన్నారు. శిబిరం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌ను సవరించాలి

కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నా - బడ్జెట్లో రాష్ట్రానికి తీరని అన్యాయం - సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

భీమవరం ధర్నాలో నినదిస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమవరం

పేదలు, సామాన్య, మధ్య తరగతి ప్రజలపై భారాలు వేసి కార్పొరేట్లకు అనుకూలంగా ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌ను తక్షణం సవరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2023-24 బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా మండుటెండలో నేలపై బైఠాయించి నిరసన తెలిపారు. ఉక్కు ఫ్యాక్టరీకి నిధులు, విశాఖకు రైల్వే జోన్, ఆపాలి విశాఖ ఉక్కు అమ్మకాన్ని అరికట్టాలి, అధిక ధరలను, కార్మికుల హక్కు, కార్మికులు, నిరుద్యోగులు ఉపాధి కాపాడాలని, వివిధ రంగాల్లో ఉన్న ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని నినాదాలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ పార్లమెంట్‌లో బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2023-24 కేంద్ర బడ్జెట్ సామాన్య, మధ్యతరగతి ప్రజలకు, రైతాంగానికి ఏమాత్రం ప్రయోజనకరంగా లేదన్నారు. ధరల పెరుగుదలను అరికట్టే ప్రయత్నమే చేయలేదని విమర్శించారు. గత బడ్జెట్ కంటే కేటాయింపులు పెంచాల్సింది పోయి భారీగా కోతలు పెట్టడం దారుణమన్నారు. దీనివల్ల ప్రజలపై మరిన్ని భారాలు పడతాయన్నారు. ఒకవైపు దేశంలో ఆర్థిక సంక్షోభం రానుందని ఆర్థిక శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నా కేంద్ర ప్రభుత్వం కనీసం పట్టించుకోకుండా కార్పొరేట్లకు అనుకూలంగా బడ్జెట్ ప్రవేశపెట్టిందని ఆరోపించారు. బడ్జెట్లో రైతులకు, పేదలకు ఇచ్చే ఆహార సబ్సిడీ, మధ్యాహ్న భోజనం, గ్రామీణ ప్రాంతాల్లో పేదల కడుపు నింపుతున్న ఉపాధి హామీ, గ్యాస్ సబ్సిడీలో భారీ కోతతో పాటు దేశంలో 80 శాతం మందికి ఉపయోగపడే అన్ని పథకాల్లో కోతలు విధించారని మండిపడ్డారు. ప్రత్యేక హోదా, రైల్వే జోన్ ప్రస్తావన లేకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు దాటుతున్నా విభజన హామీలైన రాజధాని నిర్మాణం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఇస్తామన్న నిధులు, బడ్జెట్ లోటు, బకాయిలు ఇవ్వకపోవడం రాష్ట్రం పట్ల కేంద్రం వైఖరికి నిదర్శనమన్నారు. పోలవరంను జాతీయ ప్రాజెక్టు అని ప్రచారం చేసుకుంటున్న కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టు కోసం ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. దేశంలో ప్రభుత్వరంగ సంస్థలను నూరుశాతం అమ్మే తీరుతామని కేంద్ర ప్రభుత్వం చెబుతుందని, దీనిలో విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ కూడా రాష్ట్రానికి దూరం చేయాలని చూస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరిస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని, ప్రాణ త్యాగాలతో విశాఖ ఉక్కును సాధించుకున్నామని గుర్తు చేశారు.

జిల్లా అభివృద్ధికి కేటాయింపులు శూన్యం

జిల్లాలో ఆక్వా రంగం ద్వారా వేల కోట్లు ఆదాయం, ధాన్యాగారం ద్వారా దేశానికి ఆహార భద్రత అందిస్తున్న జిల్లా అభివృద్ధికి బడ్జెట్లో మాత్రం ఏ కేటాయింపులు లేవని బలరాం ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ-నిడదవోలు రైల్వే డబ్లింగ్ పనులను పూర్తి చేయడానికి సరిపడా నిధులు ఇవ్వకపోవడం కేంద్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలుస్తుందన్నారు. మరోవైపు కోటిపల్లి నరసాపురం రైల్వేలైన్‌కు అంతంతమాత్రంగానే నిధులు కేటాయించడం సబబు కాదన్నారు. జిల్లాలో ఆధ్వర్యంలో అభివృద్ధి చెందుతుంటే దానిద్వారా వేల కోట్లు ఆదాయం పొందడమేగాని ఆక్వా యూనివర్సిటీకి మాత్రం నిధులు ఇవ్వకపోవడం దారుణన్నారు. తాడేపల్లిగూడెంలో ఉన్న ఉద్యాన యూనివర్సిటీకి, నిట్ విస్తరణకు కేటాయింపులు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. భీమవరం పట్టణానికి ఇవ్వాల్సిన ఎక్స్‌లెన్స్ నిధులు ఇవ్వలేదన్నారు. కాలుష్య నివారణకు సరైన ప్రణాళిక నిధులను ప్రకటించలేదన్నారు. జిల్లాలో పుష్కలంగా ఉన్న ఆయిల్ సహజ వాయు నిక్షేపాలను జిల్లా నుండి భారీగా తరలించడం తప్ప జిల్లా అభివృద్ధికి చేసిందేమీ లేదని ఆరోపించారు. ఈ బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం తక్షణం సవరించి తిరిగి ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు ఎం.వైకుంఠరావు, మామిడిశెట్టి రామాంజనేయులు, ఇంజేటి శ్రీనివాస్, డి.నాగు, బి.వరలక్ష్మి, కె.కృష్ణ, బొక్కా సత్యనారాయణ, డి.త్రిమూర్తులు, కలిపిండి సత్యనారాయణ, నాగమణి, కె.సాయమ్మ, కె.కుమారి, రమేష్ పాల్గొన్నారు.

తణుకు రూరల్: బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ కార్పొరేట్లకు దేశ సంపదను దోచిపెడుతూ, ప్రజలపై భారాలు వేసేదిగా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్ విమర్శించారు. శుక్రవారం స్థానిక నరేంద్ర సెంటర్‌లో కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ ధర్నా నిర్వహించి బడ్జెట్ నమూనా ప్రతులు దహనం చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎ.అజయకుమారి, కామన మునిస్వామి, గార రంగారావు, పిఎల్.నర్సింహారావు, ఎన్.ఆదినారాయణబాబు, కేశవ, ఎం.గోవిందరాజు, అంబటి బ్రాహ్మజీ, ఎం.రమేష్, ఫణిబాబు, శ్రీనివాస్, ఎన్.చిన్నారావు, టి.వెంకటేశ్వరరావు, టి.రామకృష్ణ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిన కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకించాలని కోరుతూ సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పోలీసు ఐల్యాండ్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు, పట్టణ కమిటీ సభ్యులు కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ మోడీ బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు రాయితీలిచ్చేలా, పేద, మధ్యతరగతి ప్రజలపై భారాలు మోపేలా ఉందన్నారు. కార్యక్రమానికి చిటికిన రాము, మేడ్రేటి రమణ, జవ్వాది శ్రీను, రౌతు వెంకట్ నాగేంద్ర, వర్రి అప్పారావు, సిద్దిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, అయినాల ధర్మారావు, అగుర్తుల రామోహనరావు, అయినాల సత్యనారాయణ పాల్గొన్నారు.

పాలకొల్లు : ప్రజలకు వాతలు.. కార్పొరేట్లకు కాసులు కురిపించే కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకించాలని సిపిఎం మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు కోరారు. పట్టణంలో శుక్రవారం కరపత్రాలు పంచి నిరసన తెలిపారు. కార్యక్రమంలో జుత్తిగ రాము, పి.నాగేశ్వరరావు, జి.గోవిందరావు, దుర్గారావు, చిన సత్యనారాయణ, కె.రాజారావు, రత్తయ్య, శ్రీనివాస్, వీరాస్వామి, అప్పారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో మాధవరం సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నేత కండెల్లి సోమరాజు మాట్లాడగా జి.వెంకట్రావు, పి.జయమ్మ, కె.నాగమణి, పసలపూడి విశ్రాంతి, తీగిరిపల్లి కృప, కడిమి నాగమణి, బెల్లంకొండ సత్యనారాయణ, బి.అప్పారావు, కడెం కుమారి, టి శ్రావణి పాల్గొన్నారు.

పెంటపాడు: కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు నాయకులు సిరపరపు రంగారావు మాట్లాడుతూ బడ్జెట్‌లో పేదల సబ్సిడీలకు, రైతులకు, వ్యవసాయ, కార్మికులకు, దళితులకు, గిరిజనులకు వివిధ రంగాలకు కేటాయింపులు గతం కన్నా భారీగా కోత విధించారని విమర్శించారు. బడ్జెట్లో రాష్ట్రానికి జరిగిన ద్రోహాన్ని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో బంకురు నాగేశ్వరరావు, మాదాసు శ్రీను, వెలగల పల్లారెడ్డి, కరక వెంకట్రావు, సత్తి శ్రీనివాసరెడ్డి, కొయ్యల శ్రీను, కొయ్యన చంటి. వేపకాయల సత్యనారాయణ పాల్గొన్నారు.

తణుకులో..

ఆచంట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్ని రంగాలకు అరకొరగా నిధులు కేటాయించి మన రాష్ట్రానికి మరోసారి మొండిచెయ్యి చూపిందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. సిపిఎం ఆధ్వర్యాన శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు సిర్రా నరసింహమూర్తి, మచ్చ సుబ్బారావు, ఇందుకూరి సూర్యనారాయణరాజు, తోటపల్లి సత్యనారాయణ, కుసుమే జయరాజు, రాయపాటి మధుకిరణ్, వీరయ్య, కె.రాజు, నరసింహమూర్తి పాల్గొన్నారు.

నరసాపురం: కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో రాష్ట్రం, జిల్లాకు తీవ్రమైన నష్టం చేకూర్చారన్నారు. అనంతరం తహశీల్దార్ ఎమ్‌డి.సాజిల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నేతలు బొక్కా శ్రీనివాసరావు, జల్లి రామ్మోహన్‌రావు, గుత్తుల శ్రీరామచంద్రుడు, వాటాల ధనుంజయ్, గుబ్బల చిన్ని, దొంగ భాస్కరరావు, మంచిలి నీలకంఠం, పొన్నాడ రాము, పొగాకు నారాయణరావు, బూడిద జోగేశ్వరరావు, మోకా శివరాజు తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి: కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా మండలంలోని చించినాడ జాతీయ రహదారిపై సిపిఎం ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు బాతిరెడ్డి జార్జి మాట్లాడగా నేతలు కానేటి బాలరాజు, దేవ సుధాకర్, సరిపల్లి జయప్రభ, గొల్ల ఏడుకొండలు, గోగినేని సత్యనారాయణ, ఎస్.బాబూరావు, ఎస్.నాగమణి, బాతిరెడ్డి సుగుణ, పల్లేరు దాసు పాల్గొన్నారు.

పెనుగొండ: కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. నాయకులు షేక్ పాదుషా మాట్లాడగా కప్పల రత్నంరాజు, గుర్రాల సత్యనారాయణ, నాగిశెట్టి గంగారం, నాగేశ్వరరావు, యేసు, గెద్దాడ శ్రీనివాసు పాల్గొన్నారు.

పెనుమంట్ర: కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ బ్రాహ్మణ చెరువు చిన్న వంతెన వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు మాట్లాడగా ఇందుకూరి వెంకట్రాజు, తెన్నేటి ఆంజనేయులు, మాదాసు లక్ష్మణరావు, చదలవాడ చిన్నబ్బులు, కముజు రామకృష్ణ, వేజర్ల సూర్యనారాయణ, తానేటి నాగేశ్వరరావు, దంపనబోయిన ఏలియా, చింతపల్లి అప్పారావు పాల్గొన్నారు.

వీరవాసరం: కేంద్ర బడ్జెట్ కార్పొరేట్లు దోచుకోవడానికి తప్ప ప్రజాప్రయోజనాలకు ఉపయోగకరంగా లేదని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జుత్తిగ నరసింహమూర్తి అన్నారు. కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం నవుడూరు జంక్షన్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడగా కేతా జ్యోతిబసు, మల్లుల సత్యనారాయణ, యాళ్లబండి నారాయణమూర్తి, మైగాపుల రాంబాబు, గొట్టుముక్కల శ్యాంబాబు, నూకరాజు, రమేష్, గిద్దా శ్రీను పాల్గొన్నారు.

భీమవరం రూరల్: కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యాన మండలంలో వెంప, తోకతిప్ప గ్రామాల్లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడారు.

ఆక్వాకు రూ.1.50కే విద్యుత్

రైతులను అన్నివిధాలా ఆదుకుంటాం
కార్పొరేషన్ రుణాలు ఎత్తివేతతో బిసి, ఎస్‌సిలకు వైసిపి అన్యాయం
పోలవరంను సర్వనాశనం చేశారు
కార్యకర్తలే పార్టీకి సైన్యం, బలం
వచ్చే ఎన్నికల్లో నూటికి వెయ్యిశాతం గెలుపు మనదే
జోన్-2 నాయకులు, కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు



మాట్లాడుతున్న చంద్రబాబు



హాజరైన ప్రతినిధులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అధికారంలోకొచ్చాక ఆక్వా సాగుకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే ఇచ్చి ఆదుకుంటామని టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు తెలిపారు. ఉభయగోదావరి జిల్లాల జోన్-2 పరిధిలోని క్లస్టర్, యూనిట్, బూత్ లెవెల్, మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశం శుక్రవారం ఏలూరు బైపాస్‌రోడ్డులో నిర్వహించారు. సమావేశానికి రెండు జిల్లాల నుంచి దాదాపు మూడు వేల మంది వరకూ హాజరయ్యారు. వచ్చే ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు ఏవిధంగా వ్యవహరించాలనే దానిపై కార్యకర్తలు, నాయకులకు శిక్షణ ఇచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఓటర్ల జాబితా పరిశీలన, చనిపోయిన వారి ఓట్ల తొలగింపు, ఒకరికే రెండు ఓట్లు ఉండటం, నియోజకర్గంలో లేని వారి ఓట్లు గుర్తించి ఏం చర్యలు తీసుకోవాలో వివరించారు. పోలీసు కేసులను ఏవిధంగా ఎదుర్కోవాలి, పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై ఫొటోలు ఏవిధంగా తీసి పంపాలి, లీగల్ సెల్‌తో ఏవిధంగా సంప్రదించాలో తెలిపారు. సంక్షేమ పథకాల్లో ప్రభుత్వం ఏవిధంగా కోతలు పెడుతుందో, జనాలకు ఏవిధంగా నష్టం చేకూరుస్తుందో ప్రజలకు ఎలా వివరించాలో శిక్షణ ఇచ్చారు. యూనిట్ పరిధిలో ఉండే దాదాపు 1200 ఇళ్లకు సంబంధించి రోజుకు 40 ఇళ్లను కలవాలన్నారు. యూనిట్, క్లస్టర్, బూత్‌లెవెల్, కొత్తగా నియమిస్తున్న కుటుంబ సారథులంతా జనంలో ఉండి ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలన్నారు. అదే సమయంలో టిడిపి హయాంలో అమలు చేసిన సంక్షేమం గురించి ప్రజలకు తెలియజెప్పాలో వివరించారు.

కార్యకర్తలే పార్టీకి వెన్నెముక: చంద్రబాబు

టిడిపికి కార్యకర్తలే వెన్నెముక అని చంద్రబాబు అన్నారు. మధ్యాహ్నం మూడున్నర గంటలకు శుక్రవారం ఏలూరు జరిగిన జోన్-2 సమావేశంలో పాల్గొన్న ఆయన పలు అంశాలపై మాట్లాడారు. ఆక్వాసాగుకు యూనిట్‌కు రూ.రెండుకే ఇస్తామని, ఇప్పుడు జోన్, నాన్ ఆక్వాజోన్ పేరుతో రూ.4.50 చేశారన్నారు. టిడిపి అధికారంలోకొచ్చాక ఆక్వాకు యూనిట్‌కు రూపాయిన్నరకే విద్యుత్ ఇస్తామన్నారు. మూడు, నాలుగు నెలలకు కూడా ధాన్యం డబ్బు వేయడం లేదని, అధికారంలోకొచ్చాక రైతులను అన్నివిధాలా అదుకుంటామన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను మీరు జనాలకు చెప్పగలిగితే వైసిపికి డిపాజిట్లు కూడా రావన్నారు. నూటికి వెయ్యిశాతం వచ్చే ఎన్నికల్లో టిడిపినే గెలుస్తుందన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలన్నారు. ఓటర్ల జాబితా అవకతవకలపై కేంద్రం, ఎన్నికల సంఘం, కోర్టుకు వెళ్లదామని తెలిపారు. వెనుకబడిన తరగతులకు టిడిపి అండగా ఉంటుందని, అజెండా, మేనిఫెస్టో అదే ఉంటుందన్నారు. ఎస్‌సిలకు సంబంధించి 27 పథకాలను రద్దు చేశారన్నారు. కార్పొరేషన్ రుణాలు ఇవ్వకుండా ఆపేశారన్నారు. టిడ్కో ఇళ్లు ఇవ్వకుండా లబ్ధిదారులను ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. 72 శాతం పూర్తి చేసిన పోలవరంను సర్వనాశనం చేశారన్నారు. ఒక్కొక్కరిపై రెండు లక్షల అప్పు ఉందన్నారు. వైసిపిపై జనాల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. జనంలో ఉన్నవారికే ఎంఎల్ఎ టిక్కెట్ ఇస్తామని, ఆవిధంగా చేద్దామా అంటూ కార్యకర్తలను చేతులెత్తి చెప్పాలనడంతో అంతా చేతులెత్తారు. ఇసుక, మైనింగ్ మాఫియా గురించి ప్రజలకు వివరించాలన్నారు. సంక్షేమం పేరుతో రూ.పది వేలు ఇచ్చి రూ.లక్ష లాగేస్తున్నారని తెలిపారు. మద్యం ముసుగులో పెద్దఎత్తున దందా నడుస్తుందన్నారు. నిత్యావసరాల ధరలు పెరిగిపోయాయన్నారు. టెక్నాలజీలో చాట్‌జిపిటిని ఉపయోగించాలన్నారు. వివేకా హత్య కేసులో టెక్నాలజీతో సిబిఐ జగన్ బండారం బయట పెడుతుందని తెలిపారు. పని చేసిన వారికే పార్టీ అధికారంలోకొచ్చాక పదవులు ఇస్తామన్నారు. ప్రభుత్వం జిఓ-1 తెచ్చి సమావేశాలు, సభలను అడ్డుకుంటుందన్నారు. నాయకులు, కార్యకర్తలతో పలు అంశాలపై మాట్లాడించారు. కార్యక్రమంలో ప్రస్తుత ఎంఎల్ఎలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఏడు నామినేషన్లు ఓకే

నల్లి రాజేష్ నామినేషన్ తిరస్కరణ

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎంఎల్‌సి స్థానాలకు సంబంధించిన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పూర్తయ్యింది. శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు నామినేషన్ల పరిశీలన ప్రక్రియ నిర్వహించారు. మొత్తం ఎనిమిది మంది అభ్యర్థులు 15 నామినేషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. నామినేషన్ల పరిశీలన అనంతరం ఏడు నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు గుర్తించారు. వైసిపి నుండి కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని తేల్చారు.

వంకా రాజకుమారి, వీరవల్లి చంద్రశేఖర్, దేవరపల్లి ఆదాం, గోరింక దాసు, పసల వెంకటాచలం నామినేషన్లను ఇండిపెండెంట్ అభ్యర్థుల నామినేషన్లుగా గుర్తించి పరిగణనలోకి తీసుకున్నట్లు అరుణ్‌బాబు తెలిపారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన నల్లి రాజేష్ మూడుసెట్ల నామినేషన్లు నిబంధనల మేరకు లేకపోవడంతో తిరస్కరించినట్లు అరుణ్‌బాబు చెప్పారు.

రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతాం

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి - ఢిల్లీ ధర్నాలో యుటిఎఫ్ జిల్లా నేతలు

ప్రజాశక్తి - భీమవరం

ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి హెచ్చరించారు. విద్యారంగం, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చేపట్టిన చలో ఢిల్లీ, ధర్నాలో జిల్లాకు చెందిన యుటిఎఫ్ నేతలు పాల్గొన్నారు. అక్కడ జరిగిన ధర్నాలో గోపీమూర్తి మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని, నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని కోరారు. విద్యా హక్కు చట్టాన్ని 12వ తరగతి వరకు విస్తరింపజేసి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. రూ.7.50 లక్షలు ఆదాయం వరకు పన్ను మినహాయింపు ఇవ్వాలని, రూ.2.50 లక్షలు వరకు స్టాండర్డ్ డిటెక్షన్ ఉండాలని, 80 సీసీ మినహాయింపు రూ.మూడు లక్షల వరకు ఉండాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన ధర్నాలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.మార్కండేయులు, జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు ఎస్.రత్నరాజు, పి.క్రాంతికుమార్, ఎం.శ్రీనుబాబు, కె.త్రిమూర్తులు, అజయ్ శాంసన్, శ్రీలక్ష్మి, జి.సుధాకర్, కె.నాగరాజు, ఆర్‌ఎల్ఎన్.మూర్తి పాల్గొన్నారు.

ఢిల్లీలో మాట్లాడుతున్న గోపీమూర్తి

లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు

డిఎంహెచ్ఒ మహేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

ఆసుపత్రుల్లో, స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి మహేశ్వరరావు హెచ్చరించారు. డిఎంహెచ్ఒ కార్యాలయంలో పిసిపిఎన్‌డిటి యాక్టుకు సంబంధించి జిల్లా స్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. డిఎంహెచ్ఒ డి.మహేశ్వరరావు అధ్యక్షతన పలు అంశాలు చర్చించారు. ప్రతి స్కానింగ్ సెంటర్‌లో విధిగా మూడుచోట్ల బేనర్లు అమర్చాలని, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలకు సంబంధించిన బేనర్లు అందరికీ కన్పించేలా ప్రజలు వేచి ఉండే గది, స్కానింగ్ చేసే ప్రాంతం, బయట తెలుగు, ఇంగ్లీషు భాషల్లో ప్రదర్శించాలన్నారు. ఆసుపత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ స్కానింగ్ గదిలో ఉంచాలని, ప్రతి గర్భవతికి స్కానింగ్ అయిన ఫామ్-ఎఫ్ రిపోర్టును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కొత్తగా అనుమతుల కోసం, రెన్యువల్ కోసం మార్పులు, చేర్పులు ఆన్‌లైన్‌లో మాత్రమే నమోదు చేసుకుని అనుమతి పొందాలన్నారు. లింగ నిర్ధారణ కోరిన వారు, ప్రోత్సహించిన వారు, చేసిన వారికి శిక్షలు తప్పవన్నారు. మొదటిసారి మూడు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.50 వేలు జరిమానా విధిస్తారని తెలిపారు. ఎవరైనా, ఎక్కడైనా గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు తెలిస్తే జిల్లా వైద్యఆరోగ్య శాఖ 102, 109 టోల్‌ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుగుణరాజు, ఎం.వెంకటేశ్వర్లు, సత్యాదేవి నాగేశ్వరరావు, వి.శిరీష్ పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు భూమి చూపుతాం : ఇన్‌ఛార్జి జెసి సూర్యతేజ

ప్రజాశక్తి - భీమవరం

పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే వారికి నరసాపురం ప్రాంతంలో భూమిని సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఇన్‌ఛార్జి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.సూర్యతేజ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జెసి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే వారికి త్వరితగతిన అనుమతులు, బ్యాంక్ రుణాలను మంజూరు చేయాలన్నారు. పెద్ద పరిశ్రమలకు ఏవిధంగా అనుమతులు మంజూరు చేస్తున్నామో.. అలాగే చిన్న పరిశ్రమలకు అనుమతులు, రుణాల మంజూరుకు కృషి చేయాలన్నారు. నరసాపురం ప్రాంతంలో పరిశ్రమల స్థాపనకు అనువైన పరిశ్రమలను గుర్తించాలన్నారు. పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే వారికి భూమిని కేటాయించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. సింగిల్ డెస్క్ ఆమోదానికి 11 దరఖాస్తులు అందగా తొమ్మిది ఆమోదించినట్లు తెలిపారు. మిగిలిన రెండు దరఖాస్తులు కూడా వారంలోపు ఆమోదానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశ్రామిక రాయితీలు 16 కేసుల పరిష్కారానికి రూ.కోటీ 67 లక్షల 57 వేలు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం కింద 80 దరఖాస్తులు లక్ష్యం కాగా, లక్ష్యానికి మించి 128 దరఖాస్తులను బ్యాంకుకు పంపించామన్నారు. ఇప్పటి వరకూ 85 మంజూరు చేయగా, మిగిలిన 43 వారంలోపు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. హైదరాబాద్ వంటి నగరాల్లోని పారిశ్రామికవేత్తల్లో జిల్లావాసులు కూడా ఉన్నారని ఆయన గుర్తు చేశారు. మార్చి 3, 4 తేదీల్లో విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారని, జిల్లాలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు అంతా పాల్గొనాలని సూచించారు. జిల్లా పరిశ్రమల శాఖాధికారి ఉయ్యాల ఆదిశేషు మాట్లాడుతూ ముద్ర రుణాల కింద 66,642 మందికి రూ.83.74 కోట్లు, కిశోర్ పథకం కింద 22,099 మందికి రూ.262.34 కోట్లు, తరుణ్ పథకం కింద 3,724 మందికి రూ.215.73 కోట్లు మంజూరయ్యాయన్నారు. జగనన్న కాలనీల్లో గృహనిర్మాణాలు చేపట్టవలసిన చోట ఫ్లైయాష్ బ్రిక్ యూనిట్స్ మొదటి విడతగా ఐదు పెట్టించాలని గత సమావేశంలో కలెక్టరు సూచించారని, భీమవరం, తణుకు, యలమంచిలి మండలం కొంతేరు, తాడేపల్లిగూడెం, నరసాపురం మండలం రుస్తుంబాదల్లో ఏర్పాటు చేయగా భీమవరం, తణుకుల్లో తయారీ ప్రారంభించారన్నారు. సమావేశంలో

బడి బయట పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

చదువు మానేసి బడి బయట ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో డ్రాప్‌వుట్లపై సంబంధిత అధికారులతో ఆమె సమీక్షించారు. జిల్లాలో 473 మంది పిల్లలు బడి బయట ఉన్నారని, వీరందరినీ పాఠశాలలో చేర్చేందుకు చర్యలను వేగవంతం చేయాలని అన్నారు. అనారోగ్య కారణాలు, మైగ్రేషన్, బాల్య వివాహాలు తదితరాలు డ్రాప్‌ఔట్స్‌కు కారణంగా ఉన్నాయన్నారు. బాల్య వివాహాలు చేసుకున్న ఆడపిల్లలను పట్టణ వసతి గృహాల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనారోగ్య కారణాలు చూపుతున్న వారి వివరాలను ఫొటోతో సహా సేకరించి ఉంచాలన్నారు. ఈ సమావేశంలో డిఇఒ ఎ.వెంకటరమణ, సమగ్ర శిక్ష ఎపిసి పి.శ్యాంసుందర్, ఎఎల్ఎస్ కోఆర్డినేటర్ జిఎజె.దీవెనమ్మ, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారి సుజాతరాణి, భీమవరం డిఎల్‌డిఒ కె.కృష్ణకిశోర్ పాల్గొన్నారు.

కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్

ప్రజాశక్తి - ఉండి

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నూతన బడ్జెట్ కేవలం కార్పొరేట్లకే అనుకూలంగా, రైతాంగానికి వ్యతిరేకంగా ఉందని సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ విమర్శించారు. మండలంలోని ఆరేడు, పాందువ్వ గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం వైఖరిని ఎండగడుతూ సిపిఎం ప్రచార యాత్ర నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన బడ్జెట్లో రైతులకు, సామాన్య మధ్యతరగతి ప్రజలకు వ్యతిరేకంగా కేవలం కార్పొరేట్లకు అనుకూలంగా ఉందని మండిపడ్డారు. అంబానీ, ఆదానీ ఆస్తులను పెంచే విధంగా పెట్టుబడిదారీ కార్పొరేట్లకు రూ.లక్షల కోట్లు కేటాయించడం దుర్మార్గమన్నారు. ఆక్వా రంగం ద్వారా ఏటా కోట్లు ఆదాయం, ధాన్యాగారం ద్వారా దేశానికి ఆహార భద్రత అందిస్తున్న పశ్చిమగోదావరి జిల్లా అభివృద్ధికి ఏమాత్రం నిధులు కేటాయించలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నూతన బడ్జెట్ ఏ రంగానికి ఆశాజనకంగా లేదని, పునరాలోచించి నూతన బడ్జెట్‌ను సవరణ చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారాని గోపి, కిల్లారి తవిటినాయుడు, వీరపల్లి త్రిమూర్తులు, నేలపాటి నాగేశ్వరరావు, పేరూరి సుబ్రహ్మణ్యం, మల్లిపూడి వెంకటేశ్వరరావు, చిట్టిబాబు, శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

'ఫ్యామిలీ ఫిజీషియన్'ను ప్రజలకు చేరువ చేయండి

డిఎంహెచ్ఒ మహేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలని జిల్లా వైద్యాధికారి (డిఎంఅండ్‌హెచ్ఒ) డాక్టర్ మహేశ్వరరావు అన్నారు. కొవ్వాడ, అన్నవరం గ్రామాల్లో పాలకోడేరు పిహెచ్‌సి వైద్యులు రంగనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని డిఎంహెచ్ఒ మహేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎంఅండ్‌హెచ్ఒ వైద్యులకు తగు సూచనలు అందించారు. అనంతరం ఒపి రికార్డులను పరిశీలించారు. డ్రై డే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ సత్యనారాయణ, హెచ్‌వి చందీరాణి, హెచ్‌ఎస్ శంకర్, ఎంఎల్‌హెచ్‌పి ప్రమీల, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బసవయ్యనాయుడు మృతికి సంతాపం

ప్రజాశక్తి - పాలకొల్లు

కాంగ్రెస్ మండల అధ్యక్షులు కొమ్ముల బసవయ్య నాయుడు (74) గురువారం రాత్రి హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆయన మృతి పట్ల కాంగ్రెస్ పాలకొల్లు పట్టణ అధ్యక్షులు యడ్ల శివాజీ, నియోజకవర్గ ఇన్‌ఛార్జి వర్ధినీడి బాబ్జీ, బోనం వెంకట్రావు, పిసిసి సభ్యులు కొరగంజుల హరికిరణ్, షేక్ మహబూబ్ జానీ, కొలుకులూరి అర్జునరావు, వర్ధినీడి కాసు, రుంకాని శ్రీనివాస్, బోనం వెంకట్రావు, రొక్కాల బెన్నిపాల్, గోడి మోహనరావు, బొలిశెట్టి భానుప్రకాష్, కడలి భాస్కరరావు సంతాపం తెలిపారు.

జాగృతి విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - వీరవాసరం

రామకృష్ణ మిషన్ 125వ ఆవిర్భావ వార్షికోత్సవాలను పురస్కరించుకుని వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆ సంస్థ నిర్వహించిన జాగృతి సాంస్కృతిక పోటీల్లో భాగంగా గెలుపొందిన విద్యార్థులకు శుక్రవారం బహుమతులు అందించారు. ఈ పోటీలను శ్రీరామకృష్ణ ప్రభ ప్రత్యేక సంచికపై నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బి.ప్రభాకరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వివేకానందుని బోధనలు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామకృష్ణ సేవాసమితి నరసాపురం సభ్యులు రంగరాజు, రాంబాబు, ఉపాధ్యాయులు పడిమిమర్, హేమలత, వెంకటేశ్వరరావు, నరసింహారావు, వెంకటరాజు, రవికుమార్, లక్ష్మీపార్వతి, విజయలక్ష్మి, పెద్దిరాజు, కృష్ణ పాల్గొన్నారు.

ప్రజలకు సంక్షేమ పాలన : ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు

ప్రజాశక్తి - ఆచంట

ప్రజలకు సంక్షేమ పాలన అందించడమే సిఎం జగన్ లక్ష్యమని ఆచంట ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. ఆచంట పంచాయతీ పరిధి పెద్దపేటలో శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షులు పిచ్చెట్టి సత్యనారాయణ, మండే శ్రీనివాస్, మట్టా ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ రక్షణ కవచం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వాహనదారులకు హెల్మెట్ రక్షణ కవచం వంటిదని తాడేపల్లిగూడెం రూరల్ ఎస్ఐ భద్రరావు అన్నారు. చినతాడేపల్లి రోడ్డులో రిలయన్స్ పెట్రోల్ బంకు వద్ద వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ భద్రరావు మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. చిన్న పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

పలుచోట్ల సామూహిక ఎలుకల నిర్మూలన

ప్రజాశక్తి - ఉండి

సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారి బి.సంధ్య ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వ్యవసాయ సహాయ సంచాలకులు కెఎస్ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ భూముల్లోనూ, బంజరు భూముల్లోనూ, కాలువ గట్ల వద్ద ఎలుకలు జీవించి ఉన్న బొరియలను గుర్తించి వాటిని మట్టితో పూడ్చినట్లు తెలిపారు. సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు సజీవంగా ఉన్న ఎలుకల బొరియలను గుర్తించి వాటిని మట్టితో పూడ్చాలని సూచించారు. రెండో రోజు మట్టితో పూడ్చిన ఏ బొరియ అయితే తెరిచి ఉందో ఆ బొరియలో ప్రభుత్వం అందిస్తున్న బ్రోమోడయోలిన్ మందును పది గ్రాముల పొట్లం కట్టి ఉంచాలని తెలిపారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రభుత్వం అందించే బ్రోమోడయోలిన్ మందును రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో ఎలుకల కన్నాలను గుర్తించి వాటిని మూసి వేసినట్లు వ్యవసాయ అధికారి అబ్దుల్ రహీం చెప్పారు. శనివారం కన్నాల్లో ఎలుకల నివారణ మందును వేయనున్నట్లు చెప్పారు.

మొగల్తూరు : పంట నష్టం కలిగించే ఎలుకల నివారణకు సామూహికంగా అన్నదాతలు చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వరరావు సూచించారు. మొగల్తూరులోని గొల్లగూడెంలో ఎలుకల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలుకల నిర్మూలనకు మందులను శనివారం అందిస్తామని చెప్పారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి

భర్తకు గాయాలు

ప్రజాశక్తి - పోడూరు

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా భర్తకు గాయాలైన ఘటన పాలకొల్లు మార్టేరు రహదారిపై జిన్నూరు వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. ఎఎస్ఐ కేతా నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. నరసాపురం మండలం లిఖితపూడికి చెందిన యనమదుర్తి సుబ్బారావు, తన భార్య మంగతాయారు(55) శుక్రవారం ద్విచక్ర వాహనంపై పెనుగొండ మండలంలోని కోరాలపర్రులో వివాహానికి హాజరయ్యారు. అనంతరం బైక్‌పై తిరిగి లిఖితపుడి బయలుదేరారు. ఈ క్రమంలో జిన్నూరు కనక దుర్గ ఆలయం వద్దకు వచ్చేసరికి వీరి బైక్‌ను వెనుక నుంచి టిప్పర్ లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కింద పడిపోయిన మంగతాయారు తలపై లారీ చక్రం ఎక్కడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. గాయాలపాలైన సుబ్బారావును వెనుక వస్తున్న బంధువులు 108లో పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సుబ్బారావు కుమారుడు హనుమకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పుట్టగొడుగుల్లా అనధికార లే అవుట్లు

హెచ్చరిక బోర్డులనూ తొలగిస్తున్న వైనం

చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

మొగల్తూరులో అనధికార లే అవుట్

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని గ్రామాల్లో అనధికార లే అవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఆక్రమణ దారులు ఒక్కొక్క గ్రామంలో పదుల సంఖ్యలో లే అవుట్లను ఏర్పాటు చేస్తున్నారు. వీటిని నియంత్రించాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమ లేఅవుట్లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసి తమ పని పూర్తయ్యిందని అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ఆక్రమణ దారులు హెచ్చరిక బోర్డులను ఖాతారు చేయకుండా తొలగిస్తున్నారు. అయినా అధికార యంత్రాంగం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

లేఅవుట్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేస్తున్న పంచాయతీ సిబ్బంది

మండల కేంద్రమైన మొగల్తూరు, పేరుపాలెంసౌత్, ముత్యాలపల్లి, రామన్నపాలెం, కెపిపాలెం గ్రామాల్లో సుమారు 25 అక్రమ లే అవుట్లు ఉన్నాయి. వాటికి ప్రభుత్వ అనుమతి లేదు. పంచాయతీకి పది శాతం స్థలం కేటాయించిందీ లేదు. ఆ లే అవుట్లలో ఏర్పాటుచేసిన స్థలాల క్రయ, విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. రోడ్లను కూడా స్థలాలు కొనుగోలు చేసుకున్నవారికి కొలతలు కొలిచి కొనుగోలుదారుల పేరున రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారు.

లే అవుట్లను మెరక చేసేందుకు చేలు, తోటల్లో నుంచి మట్టి, ఇసుకను తరలిస్తున్నారు. అలా తరలించే మట్టి, ఇసుకకు మైనింగ్ శాఖకు సీనరేజీ చెల్లించకుండా ఎగవేస్తున్నారు. సుమారు మూడు నెలల కిందట మైనింగ్ శాఖాధికారులు పలు లే అవుట్లను తనిఖీచేసి నిర్వాహకులకు అపరాధ రుసుం విధించారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

మేడిది నవీన్‌కిరణ్, ఇఒఆర్‌డి, మొగల్తూరు

గ్రామాల్లో అనధికార లే అవుట్లు ఏర్పాటు చేసిన వారిపై తగు చర్యలు తీసుకుంటున్నాం. మొగల్తూరులో గుర్తించిన 12 అనధికార లే అవుట్ల యజమానులకు నోటీసులు జారీ చేశాం. రామన్నపాలెం, పేరుపాలెం తదితర గ్రామాల్లో ఏర్పాటుచేసిన అనధికార లే అవుట్ల యజమానులకు కూడా నోటీసులు జారీ చేస్తాం. వీటి కట్టడకి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం.

ఇసుక అక్రమ తవ్వకాలు నిలిపివేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని ఏనుగువానిలంక పరిధిలో ఉన్న లంక భూముల్లో ఇసుక అక్రమ తవ్వకాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. మండలంలోని చించినాడ అమరవీరుల స్మారక భవనంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి బాలరాజు మాట్లాడారు. హౌసింగ్ జిల్లా అధికారులు, యలమంచిలి రెవెన్యూ అధికారులు ఇరువురు మట్టి మాఫియాతో చేతులు కలిపి పేరుకు మాత్రం జగనన్న లే అవుట్ల పూడికకు అని చెప్పి రూ.కోట్లు విలువైన ఇసుకను పక్కదారి పట్టించారన్నారు. ఈ క్రమంలో ఇసుక తరలింపును అడ్డుకునేందుకు ప్రయత్నించిన స్థానికులకు ఇక్కడి ఇసుకను తవ్వడానికి జిల్లా కలెక్టర్ అనుమతులు ఉన్నాయని, అడ్డొస్తే పోలీస్ ఫోర్స్‌ను దింపి కేసులు పెడతామని బెదిరించి మరీ గోదావరి నది గర్భాన్ని ఆనుకొని వందలాది టిప్పర్లతో ఇసుకను నెల రోజులుగా తవ్వేశారన్నారు. దీనిపై డి ఫారం పట్టా లంకభూముల డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో కోర్టులో కేసు వేసిన నేపథ్యంలో కోర్టు అడిగిన ప్రశ్నకు మైనింగ్ అధికారులు తాము ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదని సమాధానం చెప్పారన్నారు. ఇసుక తవ్వకాలకు అనుమతి లేకపోయినా ఇసుకను తరలించారంటే ఎంతటి ఇసుక కుంభకోణం జరిగిందో అర్థమవుతుందని, దీనిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు బాతిరెడ్డి జార్జి, మండల నాయకులు దేవ సుధాకర్, ఎడ్ల మోహన్‌రావు, బాతిరెడ్డి సుగుణ, గొల్ల ఏడుకొండలు, రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు



ఆర్‌డిఒకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అక్రమ నిర్మాణాలు ఆపాలని ఆర్‌డిఒకు వినతి

ప్రజాశక్తి - ఆకివీడు

స్థానిక సమతా నగర్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ పోరంబోకు భూమిని ఆక్రమించుకుని లే అవుట్లు వేసి చేపట్టిన అక్రమ నిర్మాణాలని ఆపాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక జగనన్న కాలనీలో ఆర్‌డిఒను సిపిఎం నాయకులు కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ సమతా నగర్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ పోరంబోకు భూమిలో అక్రమ నిర్మాణాలను ఆపి, ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అప్పారావు, రవితేజ, బివి.వర్మ పాల్గొన్నారు.

జగనన్న లే అవుట్ల పరిశీలన

ప్రజాశక్తి - పెనుమంట్ర

లబ్ధిదారులు నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని హౌసింగ్ ఇఇ వివిఎస్.సిద్ధాంతి సూచించారు. పెనుమంట్ర పరిధిలోని లే అవుట్లను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిద్ధాంతి మాట్లాడుతూ వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని చెప్పారు. ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జి, హౌసింగ్ ఎఇ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఎపి నిట్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఉల్కన్ జి సాంకేతిక, సాంస్కృతిక ఉత్సవాలు శుక్రవారం మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వీరేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఆటలైనా, పాటలైనా, కళలైనా పాఠాలైనా మనస్సు పెట్టి సాధన చేస్తే విజయ లక్ష్యాలను సులువుగా ఛేదించవచ్చన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను కనువిందు చేశాయి. ఈ కార్యక్రమంలో డీన్‌లు డాక్టర్ జిఆర్‌కె.శాస్త్రి, డాక్టర్ టి.కురుమయ్య, డాక్టర్ ఎన్.జయరామ్, అసోసియేట్ డీన్ డాక్టర్ తలారి రేష్మా, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ పి.శంకర్, డాక్టర్ రాజేశ్వరరెడ్డి, డాక్టర్ సౌమ్య, డాక్టర్ హైమావతి పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు బెంచీలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నాడు నేడు కార్యక్రమంలో భాగంగా పెదతాడేపల్లిలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలకు 240 నూతన బెంచీలు ప్రభుత్వం అందించినట్లు ప్రిన్సిపల్ బి.రాజారావు తెలిపారు. పాఠశాల గదుల్లో ఏర్పాటు చేసిన నూతన బెంచీలను విద్యా కమిటీ గౌరవ అధ్యక్షులు కత్తుల రవిజైన్‌తో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రాజారావు మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు ప్రభుత్వం విద్యతోపాటు అన్నిరకాల మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ ప్రతాప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హుబ్లీ, వారణాసిలకు రైళ్ల సౌకర్యంపై త్వరలో నిర్ణయం

ప్రజాశక్తి - పాలకొల్లు

నరసాపురం నుంచి హుబ్లీ, షిరిడి, వారణాశికి నేరుగా రైలు సౌకర్యంపై విజయవాడ రైల్వే అధికారులు త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటారని రైల్వే కమిటీ సభ్యులు జక్కంపూడి కుమార్ చెప్పారు. శుక్రవారం ఆయన పాలకొల్లులో మీడియాతో మాట్లాడారు. శుక్రవారం నిర్వహించిన బోర్డు సమావేశంలో పాలకొల్లు, శృంగవృక్షం రైల్వే గేటు దగ్గర గుంతలు పూడిక వెంటనే చేపట్టాలని తాను డిమాండ్ చేసినట్లు చెప్పారు. గుంటూరు నుంచి నరసాపురం వచ్చే ఫాస్ట్ పాసింజర్ రైలు ఆలస్యంపై చర్యలు కోరానని, దానిపై త్వరలో నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. వీరవాసరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసాపురం నుంచి తన దృష్టికి వచ్చిన కొన్ని సమస్యలను డిఆర్ఎం దృష్టి కి తీసికెళ్లినట్లు చెప్పారు

చింతపర్రులో లేగ దూడల ప్రదర్శన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని చింతపర్రు గ్రామ సచివాలయం వద్ద మండల స్థాయిలో పెయ్య దూడల ప్రదర్శన, అందాల పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీల్లో సగం చెరువు, ఆగర్రు, ఆగర్తిపాలెం, అరట్లకట్ట, వెంకటాపురం, కాపవరం, చింతపర్రు, భగ్యేశ్వరం గ్రామాల నుంచి 32 పెయ్య దూడలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమం పశు సంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి శాఖ ఆధ్వర్య ంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ నిర్వహించారు. మొదటి బహుమతి చింతపర్రు గ్రామానికి చెందిన కట్టా సూర్యనారాయణ దూడకు, రెండో బహుమతి అదే గ్రామానికి చెందిన తాళం పెద్దిరాజు దూడకు, మూడో బహు మతి సగం చెరువు గ్రామానికి చెందిన సానబోయిన మంగతాయారు దూడకు లభించింది. మిగతా అన్ని దూడలకు కన్సోలేషన్ బహుమతులు, మెడికల్ కిట్లు అందించారు. లేగ దూడల పెంపకంలో మెలకువలు రైతు లకు తెలిపారు. రైతుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, భీమ వరం డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ జవహర్ హుస్సేన్, తాడేపల్లిగూడెం కార్యనిర్వ హణాధికారి డాక్టర్ జి.జేసురత్నం, పాలకొల్లు సహాయ సంచాలకులు డాక్టర్ రామశేఖర్, తాడేపల్లిగూడెం వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఎస్‌విఎన్. విజయ శ్రీ, యలమంచిలి మండల పశు వైద్యాధి కారి డాక్టర్ డి.మాధురి, రైతులు కృష్ణంరాజు, రాజశేఖర్, గుత్తుల రామారావు తాళం పెద్దిరాజు పాల్గొన్నారు.

తాలాబత్తుల వెంకటేశ్వరరావుకు పలువురి అభినందన

రంగస్థల పురస్కారం అందుకుంటున్న వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - పోడూరు

రంగస్థల పురస్కారం అందుకున్న తాలాబత్తుల వెంకటేశ్వరరావును పలువురు అభినందించారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా న్యూ ఢిల్లీ, భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త అధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర అనం కళాకేంద్రంలో ఈ నెల 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు భారత్ రంగ్ మహోత్సవం నిర్వహించారు. ఈ మహోత్సవంలో నాటక రంగం గురించి విశేష కృషి చేసిన మండలంలోని జిన్నూరు గ్రామానికి చెందిన ప్రముఖ నాటక రచయిత, నటులు, ఉపాధ్యాయులు తాలాబత్తుల వెంకటేశ్వరరావుకు రంగస్థల పురస్కారం లభించింది. డాక్టర్ హర్షభార్గవి, అసిస్టెంట్ డైరెక్టర్ పబ్లిక్ రిలేషన్స్ వారు ఈ పురస్కారం అందించారు. ఈ సందర్భంగా కళాసంస్థ ప్రతినిధులు, కళాకారులు, ఉపాధ్యాయులతో పాటు పలువురు రచయిత తాలాబత్తుల వెంకటేశ్వరరావును అభినందించారు.

ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడమే లక్ష్యం

పర్వతారోహకుడు దాసు

పాలకొల్లు రూరల్ : ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడమే తన లక్ష్యమని మండలంలోని లంకలకోడేరుకు చెందిన గోగులమండ దాసు తెలిపారు. దానిలో భాగంగా జమ్మూకాశ్మీర్లో ఐదు రోజులపాటు మైనస్ పది డిగ్రీల సెంటిగ్రేట్‌లో శిక్షణ పొందాడు. శిక్షణలో భాగంగా సుమారు 37 కిలోమీటర్లు పర్వతారోహణ చేసి మూడు పర్వతాలను అధిరోహించాలని చెప్పారు. ఈ శిక్షణ పూర్తి చేసుకుని గురువారం తిరిగి వచ్చారు. ఈ పర్వతాలను అధిరోహించడానికి శిక్షణకు తనకు ఆర్థికంగా సహాయం చేసిన మాజీ మంత్రి, ఆచంట నియోజకవర్గ ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీ రంగనాథరాజుకు ధన్యవాదాలు తెలిపారు. ఏప్రిల్ మొదటి వారంలో మౌంట్ ఎవరెస్టును అధిరోహించడానికి వెళ్తున్నట్లు చెప్పారు. పర్వతారోహకుడు దాసును గ్రామస్తులు, స్థానిక నాయకులు అభినందించారు.

రహదారి నిర్మించాలని సిపిఎం పాదయాత్ర

ప్రజాశక్తి - ఆచంట

కోడేరు ఉత్తరపాలెం నుంచి కొడమంచిలి, తీర్థాల పుంత వయా తురకవాణిమేరక వెళ్లే పంచాయతీరాజ్ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో కోడేరు ఉత్తరపాలెం నుంచి తురకవాణి మేరక మీదుగా కొడమంచిలి పంచాయతీ కార్యాలయం వరకు శుక్రవారం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ దశాబ్ద కాలంగా ఈ రహదారి పెద్ద పెద్ద గోతులుగా మారి రూపురేఖలు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన రహదారులతో పాటు గ్రామాల్లో రోడ్లకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన పాలకులు, అధికారులు శివారు ప్రాంత మార్గాలపై చిన్నచూపు చూస్తున్నారని విమర్శించారు.

పాదయాత్ర చేస్తున్న సిపిఎం నాయకులు

అధికారులు స్పందించి ఈ రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు చేసి తక్షణమే నిధులు మంజూరు చేయాలని, లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి.అంజిబాబు, ఎస్.నరసింహమూర్తి, ఎం.సుబ్బారావు, రాయపాటి మధుకిరణ్, ఇంకేటి వీరయ్య, కె.రాజు, నరసింహమూర్తి పాల్గొన్నారు.

శ్రీవాసవిలో రెండు రోజుల జాతీయ కాన్ఫరెన్స్ ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అఖిల భారత సాంకేతిక విద్యా మండలి న్యూఢిల్లీ, తాడేపల్లిగూడెం శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్‌అండ్‌డి విభాగ ఆధ్వర్యంలో ఎన్‌సిడిఇసిటి-2023 డేటా ఇంజినీరింగ్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీపై రెండు రోజుల జాతీయ కాన్ఫరెన్స్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానరికి ముఖ్య అతిథిగా హాజరైన జెఎన్‌టియుకె విశ్వ విద్యాలయం ఉప కులపతి డాక్టర్ జివిఆర్.ప్రసాదరాజు మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతలో డేటా ఇంజినీరింగ్ చాలా కీలకం కానుందన్నారు. రెండు రోజుల పాటు జాతీయ సదస్సును నిర్వహించడం హర్షణీయమన్నారు. కళాశాల పాలక వర్గ కార్యదర్శి సుబ్బారావు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నూతన కోర్సుల్లో అధ్యాపకులు శిక్షణ పొందే విధంగా ఈ జాతీయ సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రత్నాకరరావు, టెక్నికల్ డైరెక్టర్ అప్పారావు, కాన్ఫరెన్స్ అధ్యక్షులు డాక్టర్ వివిఎస్.నరేష్, కో-ఆర్డినేటర్ డాక్టర్ తామారాయ్ మాట్లాడారు. సదస్సు తొలి రోజు సెషన్‌లో ఐఐఎస్‌సి బెంగళూరు ప్రొఫెసర్ ఎన్.విశ్వనాధన్, ఆంధ్ర విశ్వ విద్యాలయం కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ వల్లి కుమారి, జెఎన్‌టియుకె ఇంజినీరింగ్ కళాశాల, కాకినాడ ప్రిన్సిపల్ డాక్టర్ ఎంహెచ్ఎం.కృష్ణప్రసాద్, ఐఐటి భువనేశ్వర్ ప్రొఫెసర్ డాక్టర్ పి.విజయశంకరరావు మాట్లాడారని కాన్ఫరెన్స్ చైర్ డాక్టర్ నరేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ ఇంజినీరింగ్ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు, రేపు రాజకీయ శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈ నెల 25, 26వ తేదీల్లో తాడేపల్లిగూడెంలో జరిగే రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కేతా పద్మజ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళ సమస్యల పరిష్కారంలో ముఖ్య భూమిక పోషిస్తున్న మహిళా సంఘం 1938లో జిల్లాలో స్వాతంత్రోద్యమంలో భాగమైందని తెలిపారు. ప్రజాస్వామ్యం, మానవత్వం, స్త్రీ విముక్తి నినాదాలతో దేశవ్యాప్త సంఘంగా 1981 సంవత్సరంలో ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జరిగే శిక్షణా తరగతులను సభ్యులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం డిపోలో ఈ నెల 25వ తేదీ శనివారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులతో సిబ్బంది ప్రవర్తన, బస్సుల కండిషన్, వివాహాది శుభకార్యాలకు విహార, విజ్ఞాన, అరుణాచలం పలు ఆధ్యాత్మిక యాత్రలకు కావాల్సిన బస్సులు పలు అంశాలపై సలహాలు సూచనలు ఫిర్యాదులు అందించడానికి 9959225488కు డయల్ చేయాలని తెలిపారు.

సాగునీటి ఇబ్బందులు రానివ్వం

ప్రజాశక్తి - వీరవాసరం

సాగునీటి ఇబ్బందులు రాకుండా సక్రమమైన వంతుల వారీ విధానం పాటిస్తామని ఇరిగేషన్ డిఇ శ్రీనివాస్ తెలిపారు. వీరవాసరం పశ్చిమ కాల్వలపై సాగవుతున్న పలు గ్రామాల ఆయకట్టులు సాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్నాయని భీమవరం ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మత్స్యపురిలో సాగునీటి ఎద్దడితో ఎండుతున్న వరి చేలను డిఇ పరిశీలించారు. శనివారం రాత్రి వరకు మత్స్యపురి ఆయకట్టుకు సాగునీటి వంతు కేటాయించాలంటూ ఎఇ సత్యనారయణను ఆదేశించారు. మూడో నెంబర్ డ్యాం, రెండో నెంబర్ డ్యాంలను మూసి వేసి వాటి పరిధిలోని ఆయకట్టులకు సాగునీరు మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

28న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర ప్రభుత్వం, కాకినాడ వికాస్ వారి సౌజన్యంతో పూలపల్లి గౌతమి డిగ్రీ కళాశాలలో ఈ నెల 28వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ దుర్గాప్రసాద్, ప్రిన్సిపల్ వై.శివకుమార్ చెప్పారు. జాబ్‌మేళాలో ప్రముఖ 20 కంపెనీలు విచ్చేస్తున్నాయని, 1190 ఉద్యోగాలకు అవకాశం ఉందని చెప్పారు. పదో తరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీ, పాలిటెక్నిక్, బి టెక్ విద్యార్హత ఉన్న అభ్యర్థులు అర్హులని చెప్పారు.

తూర్పుపాలెంలో 'పొలంబడి'

ప్రజాశక్తి - పోడూరు

పొలం బడి, సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం మండలంలోని తూర్పుపాలెం గ్రామంలో డిఆర్‌సి ఎడిఎ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సేంద్రీయ పద్ధతులు పాటించి రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ పార్వతి, ఎఇ జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రింటర్స్ డే సందర్భంగా అచ్చుయంత్రం పితామహుడు జోహన్నెస్ గూటెన్ బర్గ్ జయంతి సందర్భంగా శుక్రవారం తాడేపల్లిగూడెం మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పడాల గ్రామంలోని వద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తొలుత అసోసియేషన్ గౌరవ సలహాదారులు పిటి.వెంకన్న, సత్తి జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో బివిఆర్ కళాకేంద్రంలో గూటెన్ బర్గ్ చిత్రపటానికి పూల మాలలు వేశారు. అనంతరం నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు మద్రి సత్యనారాయణ, నేదూరి స్వామి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రింటింగ్ ప్రెస్ యజమానులు ఆవుల రమణ, కొత్తగుండు పండు, గట్టిం నాగేంద్ర, కాళి, శివ, గంగాధర్ రెడ్డి, ప్రసాద్, రాజేష్, గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్ములూరులో కృష్ణశాస్త్రి వర్ధంతి సభ

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని గుమ్ములూరు మండల పరిషత్ ప్రాథమిక ప్రధాన పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కొల్లాబత్తుల సూర్యకుమార్ అధ్యక్షతన కృష్ణశాస్త్రి వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇండియన్ బ్యాంకు మేనేజర్ సాలాపు అచ్చిబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులు కృష్ణశాస్త్రి గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు పీటర్సన్ శాంతాగ్రేస్, ఇంజినీర్ రుద్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

27న ఎంఆర్‌పిఎస్ పాదయాత్ర

ప్రజాశక్తి - ఆచంట

ఈ నెల 27వ తేదీన ఎంఆర్‌పిఎస్ పాదయాత్ర బాదంపూడి గ్రామం నుంచి ప్రారంభమవుతుందని ఎంఎస్‌పి జిల్లా కన్వీనర్ కనపాల పెద్దిరాజు తెలిపారు. ఎస్‌సి రిజర్వేషన్ వర్గీకరణలో భాగంగా మండలంలోని కరుగోరివిల్లిలో ఎంఆర్‌పిఎస్ ముఖ్య నాయకుల సమావేశం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దిగమర్తి వెంకటేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పి జిల్లా కన్వీనర్ కనపాల పెద్దిరాజు మాట్లాడుతూ మాన్యశ్రీ మందకృష్ణ ఆదేశాల మేరకు ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మున్నంగి నాగరాజు ఆధ్వర్యంలో ఎస్‌సి రిజర్వేషన్ వర్గీకరణ కోరుతూ తూర్పుగోదావరి జిల్లా నుంచి రాజధాని అమరావతి వరకు పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు.